ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 16 ఆగస్టు 2025



జిల్లా వజ్రోత్సవాల పైలాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

స్వాతంత్ర్య సంబరం

వజ్రోత్సవ



శ్రీకాకుళంలో జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

- వైభవంగా పంద్రాగస్టు వేడుకలు
- ఘనంగా జిల్లా ఆవిర్భావ దినోత్సవం
- అంతటా ఉప్పొంగిన దేశభక్తి
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీకాకుళం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు స్వాతంత్ర్య వేడుకలు.. మరోవైపు జిల్లా ఆవిర్భవించి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలతో అంతటా సందడి నెలకొంది. జిల్లావాసుల్లో దేశభక్తి ఉప్పొంగింది. శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవం, జిల్లా వజ్రోత్సవ కార్యక్రమాలు అంబరాన్ని తాకాయి. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. అలాగే శ్రీకాకుళం వజ్రోత్సవాల పైలాన్‌ను ఆవిష్కరించారు. జిల్లా ప్రజలందరికీ వజ్రోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

● ఆకట్టుకున్న ప్రదర్శనలు..

వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. దేశభక్తి, జాతీయత ఉప్పొంగేలా రూపొందించిన గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడి, తదనంతరం భారత సైన్యం సాధించిన విజయాలు, ఉగ్ర ముష్కరులను తుద ముట్టించిన ఉదంతంపై న్యూ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు చేపట్టిన 'సమైక్య భారతం' నృత్య ప్రదర్శనకు ప్రథమ బహుమతి లభించింది. శ్రీ చైతన్య టెక్నో స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన 'జయతు జయతు భారతం' నృత్యానికి ద్వితీయ, గార కేజీబీవీ విద్యార్థినులు ప్రదర్శించిన 'దేశం మనదే' నృత్య గీతానికి తృతీయ బహుమతి లభించింది. వీరికి మంత్రి అచ్చెన్నాయుడు బహుమతి అందించి అభినందించారు. ఆర్‌సీఎం లయోలా విద్యార్థులు ప్రదర్శించిన 'దేశ్ హమారా', పోలీసు శాఖ

(మిగతా 7వ పేజీలో..)



ప్రథమ బహుమతి పొందిన విద్యాశాఖ శకటం



పోలీసు పరేడ్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): 'పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. ఈ దిశగా ప్రజానీకానికి ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తున్నాం. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామ'ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. 'జిల్లాలో అన్ని వర్గాలకూ సమ ప్రాధాన్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. 75 ఏళ్ల శ్రీకాకుళం జిల్లా ప్రస్థానం ఎంతో గొప్పది. సూపర్ సిక్స్ అమలులో భాగంగా జిల్లాలో 3,12,550 మందికి పింఛన్లు పెంచాం. పంద్రాగస్టు కానుకగా స్త్రీ శక్తి పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం. మెగా డీఎస్సీ ద్వారా జిల్లాలో 543 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాం. జిల్లాలో ప్రసిద్ధ దేవాలయాల అభివృద్ధికి రూ.15.55 కోట్లు, పంట రుణాలుగా రూ.2,026 కోట్లను మంజూరు చేశాం. రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.186 కోట్లను అందించాం. డీఆర్‌డీఏ నేతృత్వంలో డ్రోన్ నిర్వహణపై శిక్షణ ఇచ్చి.. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత అందుకునేలా అవకాశం కల్పించాం. ఈ ఏడాది 1650 స్వయంశక్తి సంఘాలకు రూ.91.06 కోట్ల లబ్ధి చేకూర్చాం. మత్స్యకారుల సేవలో పథకం కిందట జిల్లాలో 15,548 మంది మత్స్యకారులకు రూ. 31కోట్లను చెల్లించాం. వన్ ప్రొడక్ట్-వన్ డిస్ట్రిక్ట్‌లో భాగంగా పలాస జీడిపప్పునకు కేంద్రం నుంచి గుర్తింపు దక్కడం ఆనందంగా ఉంది. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తాం. మూలపేట పోర్టు పనులు పూర్తికావచ్చాయ'ని తెలిపారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, నడుకుదిటి ఈశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

వెనుకబడిన ముద్రను చెరిపేద్దాం

● కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): 'శ్రీకాకుళం జిల్లాకు 75 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ గడ్డ కోసం అనేకమంది పోరాటాలు, త్యాగా లు చేశారు. ఎందరో మహనీయులు వివిధ రంగాల్లో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. అయినా జిల్లా అభివృద్ధిలో మనం వెనుకబడి ఉన్నాం. ఇకపై ఆ ముద్రను చెరిపేద్దాం. ఉదయించే జిల్లాగా తీర్చిదిద్దుదామ'ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని కేఆర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'సర్దార్ గౌతు లచ్చన్న, బొడ్డేపల్లి రాజగోపాలరావు, ఎర్రన్నాయుడు వంటి మహనీయుల సేవలు చిరస్మరణీయం. రాజకీయాలు, వ్యాపారం, సాహిత్యం, శాస్త్రం, రక్షణ దళాలు వంటి అన్ని రంగాల్లోను జిల్లాకు చెందిన ఎంతోమంది ప్రతిభావంతులు ఉన్నారు. సమష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం. జిల్లాలో ఎయిర్‌పోర్టు, పెద్ద పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు తీసుకురవడానికి సంకల్పించాం. ఇందుకు ప్రభుత్వాల కృషితోపాటు ప్రజల సహకారం కూడా అవసరమ'ని తెలిపారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. '50ఏళ్ల జిల్లా ఆవిర్భావ ఉత్సవాల్లో ఎమ్మెల్యేగా, ఇప్పుడు వజ్రోత్సవాల్లో రాష్ట్రమంత్రిగా పాల్గొనడం ఆనందంగా ఉంది. ఎందరో మహానుభావుల కృషి వలన శ్రీకాకుళం గడ్డ పేరు నిలిచింది. జిల్లాలో వలసలు నివారించి.. ఇతరులు ఇక్కడకు ఉపాధికి వచ్చేలా అభివృద్ధి

(మిగతా 7వ పేజీలో..)



పాటలు పాడుతున్న సినీ గాయకుడు రామ్ మిరియాల, తిలకిస్తున్న ప్రజలు



ప్రథమ బహుమతి పొందిన న్యూసెంట్రల్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన

చెరువులనూ వదల్లేదు

- కోటబొమ్మాళి మండలంలో జోరుగా ఆక్రమణలు
- ఆయకట్టుదారులకు తప్పని సాగునీటి కష్టాలు

కోటబొమ్మాళి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలంలో ఆక్రమణలకు అడ్డులేకుండా పోయింది. ఖాళీ స్థలాలే కాదు.. చెరువులు, బందలు, కోనేరులు సైతం ఆక్రమణకు గురై నామరూపాలు లేకుండా పోతున్నాయి. ఇటీవల కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 237/2లో సుమారు రెండు ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న చిన్నాన్న కర్ర చెరువు కబ్జాకు గురైంది. అక్రమార్కులు అంచెలంచెలుగా చెరువును ఆక్రమిస్తూ చెరువు గర్భాన్ని ఇప్పుడు పూర్తిగా మట్టితో కప్పేశారు. ఈ చెరువు కింద సుమారు 45 ఎకరాల ఆయకట్టు సాగవు తుండేది. ఇప్పుడు చెరువు పూర్తిగా నామరూపాలు లేకపోవడంతో రైతులు సాగు నీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీనిపై ఇప్పటికే స్థానికులు కొంతమంది రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు పరిశీలించి.. పనులు నిలుపుదల చేశారు. కాగా, మండలంలోని చాలాచోట్ల చెరువులు, బందలు, కోనేరులు ఆక్రమణకు గురవుతున్నాయని ఈ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వాటిని పరిరక్షించాలని కోరుతున్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ అప్పలరాజు వద్ద ప్రస్తావించగా.. చిన్నాన్న కర్ర చెరువు ఆక్రమణలు పరిశీలించామని బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



మట్టితో పూర్తిగా కప్పేసిన చిన్నాన్న కర్ర చెరువు

మహిళలకు వరం.. స్త్రీ శక్తి

- మంత్రి అచ్చెన్నాయుడు
- ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభం

శ్రీకాకుళం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు మరో సంక్షేమ బహుమతిగా.. ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించేందుకు స్త్రీ శక్తి పథకాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. శుక్రవారం శ్రీకాకుళం మండలం సింగుపురంలో ఈ పథకాన్ని ప్రారంభించి.. అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు బస్సులో ఆయన ప్రయాణించారు. మహిళలతో మాట్లాడారు. వారికి జీరో ఫేర్ టిక్కెట్లను అందజేశారు. అనంతరం ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. 'స్త్రీ శక్తి పథకం మహిళలకు వరం. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఎక్కడికైనా ఐదు రకాల బస్సుల్లో.. (పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ) మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించాం. మహిళల గౌరవం, ఆర్థిక సాధికారిత పెంపు ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. డ్వాక్రా సంఘాల ఏర్పాటు చేసి మహిళల సాధికారతకు పునాది ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కుతుంది. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నాం. 90 శాతం హామీలు నెరవేర్చామ'ని తెలిపారు.



బస్సులో మహిళకు జీరో ఫేర్ టికెట్‌ను అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

● ఆర్టీసీ బలోపేతానికి చర్యలు

ఆర్టీసీ బలోపేతానికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు మంత్రి అచ్చెన్న తెలిపారు. 'స్త్రీశక్తి పథకం అమలుకు రాష్ట్రవ్యాప్తంగా 8,450 బస్సులను సిద్ధం చేశాం. సంవత్సరానికి సుమారు రూ.2వేల కోట్లు వ్యయం కానుంది. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెంపు, ఆర్టీసీ ఖాళీ స్థలాలను వినియోగించి ఆదాయ మార్గాలు పెంచే చర్యలు చేపడతామ'ని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకరరావు, బగ్గు రమణమూర్తి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సహాయకలెక్టర్ డి.పృథ్వీరాజ్, ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ బ్రహ్మానందరెడ్డి, ఆర్డీఓ సాయిప్రత్యూష, ఆర్టీసీ డీసీలు ఎల్.ఎస్.నాయుడు, ఏడీసీ మురళీధర్, పీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



పలాస : బస్సులో మహిళా ప్రయాణికుల ఆనందం

స్వాతంత్ర్యోద్యమ యోధుడు..

సర్దార్ గౌతు లచ్చన్న

- నేడు రాష్ట్రవ్యాప్తంగా జయంత్యుత్సవాలు
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

8లో



విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ కోచ్‌ల కుదింపు

● పేద, మధ్య తరగతి ప్రజలకు తప్పని ఇబ్బందులు

టెక్కలి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు పేద, మధ్య తరగతి ప్రజలకు సక్రమంగా అందడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ రైలు రోజూ భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ వరకు రాకపోకలు సాగిస్తోంది. ఒకప్పుడు వలసలు వెళ్లే వారికి, పేదలకి ఈ రైలు సేవలు అందుబాటులో ఉండేది. గతంలో ఫస్ట్‌క్లాస్ ఏసీ ఒక కోచ్, సెకెండ్ ఏసీ రెండు కోచ్‌లు, థర్డ్ ఏసీ మూడు కోచ్‌లు, జనరల్ నాలుగు కోచ్‌లు, స్లీపర్ పది కోచ్‌లు ఉండేవి. ప్రస్తుతం జనరల్ నాలుగు కోచ్‌లు, స్లీపర్ మూడు కోచ్‌లు, ఫస్ట్‌క్లాస్ ఏసీ ఒక కోచ్, సెకెండ్ ఏసీ నాలుగు కోచ్‌లు, థర్డ్ ఏసీ ఎనిమిది కోచ్‌లతో నడుపుతున్నారు. గతంలో ఉన్న స్లీపర్ క్లాస్ బోగీలు ఏకంగా ఐదు వరకు కోత విధించడంతో జిల్లాకు చెందిన పేద, మధ్య తరగతి ప్రయాణికులు.. ఈ రైలు సేవలు పొందలేకపోతున్నారు. వాస్తవానికి విశాఖ ఎక్స్‌ప్రెస్.. సికింద్రాబాద్ వెళ్లే జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండే రైలు ఇది. ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, నౌపడా, కోటబొమ్మాళి, తిలారు, శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) తదితర స్టాప్‌లు కలిగి ఉండడంతో జిల్లా ప్రజలతోపాటు ఒడిశా వాసులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇటువంటి రైలులో స్లీపర్‌క్లాస్ కోచ్‌లు తగ్గించి థర్డ్ ఏసీ కోచ్‌లు పెంచడంపై ప్రయాణికులు, వలసజీవులు పెదవి విరుస్తున్నారు. స్లీపర్‌క్లాస్ కోచ్‌ల సంఖ్య పెంచాలని, ఆ దిశగా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కృషి చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఈ వార్డెన్ మాకొద్దు
● ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతిగృహ విద్యార్థినుల ఆందోళన

వేర్వేరు ఘటనల్లో 20 కిలోల గంజాయి స్వాధీనం
● ఒడిశాకు చెందిన ఐదుగురి అరెస్టు

సాగునీరు విడిచిపెట్టండి
● కలెక్టర్‌కు మొర

8లో

ప్రతిభకు పురస్కారాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులకు శుక్రవారం పురస్కారాలు అందించారు. మంత్రి అచ్చెన్నాయుడు ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.



ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజు, జడ్పీ సీఈవో | యు.సాయికుమార్, డీఎస్‌డీఓ (స్కిల్ డెవలప్‌మెంట్) | ఆర్‌వీవీ ప్రసాద్, జిల్లా ఉద్యానవన అధికారి | సాయి ప్రత్యూష ఆర్డీవో, శ్రీకాకుళం | ఎం.కృష్ణమూర్తి, ఆర్డీవో, టెక్కలి



మంత్రి అచ్చెన్నాయుడు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, అవార్డులు అందుకుంటున్న మిగిలిన అధికారులు, స్వచ్ఛంద సేవకులు ఇలా..



డి.రామ్మూర్తి, సూపరింటెండెంట్, కలెక్టరేట్ | ఆర్.రామారావు, డిప్యూటీ తహసీల్దార్ | జి.శ్రీనివాసరావు, డీసీఆర్బీ సీఐ | పి.దుర్గాప్రసాద్, హెడ్‌మాస్టర్ | డా.పి.పాపినాయుడు, సీహెచ్‌సీ, పలాస | డా.పి.ఉదయ్‌బాబు, సైంటిస్ట్ | వి.నరసింగరావు, డీఈఈ | డా.ఎం.రవికృష్ణ, ఏడీ, వెటర్నరీ | బొడ్డేపల్లి శైలజ, ఎమ్మీడీవో | కదలి శ్రీగౌరి, డీపీఎం, సోషల్ సెక్యూరిటీ | ఎస్.తిరుపతిరావు, డేటా ఎంట్రీ ఆపరేటర్



కె.మురళీధర్, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ | ఆర్.అప్పలరాజు, తహసీల్దార్ | పీవీ గంగాధరరావు, ఎంవీఐ | డా.డి.షకీల, ప్రొఫెసర్, రిమ్స్ | బి.రమేష్‌బాబు, ఏఎస్‌ఐ | వి.నేతాజీ, రిటైర్డ్ ఎస్‌ఐ | ఎస్.గపూర్, ఎస్‌ఐ | సీహెచ్ విశ్వనాథం, హెచ్‌సీ | నాగేశ్వరరావు, హెచ్‌సీ | వై.రామారావు, ఏఎస్‌ఐ | పి.ఉమాపతి, ఏఆర్ఎస్సై

ముగిసిన జిల్లా వజ్రోత్సవాలు

- హైలెట్‌గా రామ్ మిరియాల సంగీతం
- 30 మంది ప్రముఖులకు సత్కారం



గీతాలాపన చేస్తున్న రామ్ మిరియాల



కళాకారుల నృత్యాభినయం

అరసవల్లి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా వజ్రోత్సవ ముగింపు వేడుకలు శుక్రవారం స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో అత్యంత వైభవంగా జరిగాయి. నాట్య గురువులు నీరజా సుబ్రహ్మణ్యం, రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యులు జిల్లా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా నృత్య ప్రదర్శనలు చేపట్టారు. అభినయ కోలాటం అలరించింది. అనంతరం ప్రముఖ సినీ గాయకుడు రామ్ మిరియాల సంగీత విభావరి ఆహూతులను ఉర్రూతలూగించింది. ప్రత్యేకంగా శ్రీకాకుళం యాస లో పాడిన పాట కార్యక్రమానికే హైలైట్‌గా నిలిచింది. జిల్లా వజ్రోత్సవాల సంచికను కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్ తదితరులు ఆవిష్కరించారు. జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన 23 మంది ప్రముఖులను సత్కరించారు. స్టేడియాన్ని జెండాలు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.





సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్య రూపకాలు

జెమ్స్ వైద్య కళాశాలలో జెండా పండుగ



అరసవల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు లోని జెమ్స్ వైద్య కళాశాలలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌వీఆర్ అభినయ, సూపరింటెండెంట్ డా.సీ హెచ్‌వి అజయ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. వైద్యులు, అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా.అశోక్‌రెడ్డి, డైరెక్టర్ డా.అంబేడ్కర్, సీనియర్ మేనేజ్‌మెంట్ డా.సుధీర్, అకడమిక్ కోఆర్డినేటర్ డా.రామారావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డా.రవూఫ్ షేక్, డా.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానానికే వన్నె తెచ్చిన శర్మ

కవిటి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతానికే వన్నె తెచ్చిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే బెందాళం వెంకటేశ్వర శర్మ అని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. బొరివంకలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే శర్మ శత జయంతి ఉత్సవాలతో పాటు జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరించారు. మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమకాలం నుంచి ఈ ప్రాంత అభివృద్ధికి తన ఆస్తులను ధారాదత్తం చేసిన వ్యక్తి శర్మ అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్.రామారావు, జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ, సర్పంచ్ బి.శ్రీరాం ప్రసాద్, ఎంపీపీ కె.పద్మ, ఏఎంసీ చైర్మన్ మణిచంద్రప్రకాష్ పాల్గొన్నారు.

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన

పాత శ్రీకాకుళం, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగర పంచాయతీ విలీన గ్రామమైన పాత్రునివలస టిడ్కో కాలనీ వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు శుక్రవారం మంత్రి అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ కాంప్లెక్స్‌ను 60 సెంట్ల స్థలంలో రూ.6 కోట్లతో నిర్మించనున్నామని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఏపీఐఐసీ జోన్ మేనేజర్ ఎం.మురళీ మోహన్ మాట్లాడుతూ.. 14,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న భవనంలో 9 హాల్స్ ఉంటాయన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, జేసీ పర్మాన్ అహ్మద్‌ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, ఏపీఎంఐ జనరల్ మేనేజర్ ఎం.మురళీ మోహన్, పరిశ్రమల శాఖ ఏడీ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రన్న పేరుతో విద్యార్థులకు పారితోషికాలు

గార, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దివంగత కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు పేరున స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులకు పారితోషికాలను అందించారు. ఎర్రన్నాయుడు ఈ పాఠశాల పూర్వ విద్యార్థి అని ప్రతి ఏటా ఆయన పేరున పురస్కారాలు అందిస్తున్నట్లు హెచ్‌ఎం పద్మావతి, రిటైర్డ్ ఎంఈవో, ఎర్రన్నాయుడు బావ అయిన బోర వాసు దేవరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు ఆపకుంటే ఉద్యమం

ఆమదాలవలస, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి తప్పించకుంటే ఉద్యమిస్తామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి హెచ్చరించారు. శుక్రవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో సంఘ ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. మూల్యాంకనం కోసం కొత్తగా ప్రవేశ పెట్టిన అసైన్ మెంట్ బుక్‌లను ప్రస్తావిస్తూ.. ఇదెక్కడి మూల్యాంకన విధాన మని, ఒక్కో ఉపాధ్యాయుడు మౌఖిక పరీక్షల విద్యార్థుల ప్రతి స్పందనలను వందలాది పేజీలు రాయాల్సి ఉంటుందన్నారు. బోధనా సమయాన్ని హరించే విధానాలు మానుకోవాలన్నారు. ప్రతినిధులు ప్రభాకరరావు, రామకృష్ణ, హనుమంతు సత్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మువ్వన్నెల రెపరెపలు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అధికారులు, న్యాయాధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యార్థుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

-ఆంధ్రజ్యోతి బృందం



శ్రీకాకుళం లీగల్: జిల్లా కోర్టు ఆవరణలో జాతీయజెండాను ఎగుర వేస్తున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా



శ్రీకాకుళం కలెక్టరేట్: చిన్నారులకు చాక్లెట్లను పంచిపెడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి











కవిటి, పలాస రూరల్, పాతపట్నం, రణస్థలం, నరసన్నపేటల్లో జెండాలను ఎగుర వేసి వందనం చేస్తున్న ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, నడుకుదిటి ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి



అరసవల్లి: టీడీపీ కార్యాలయంలో జెండా ఎగురవేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మూర్తి



ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీలో జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న వీసీ ప్రొఫెసర్ రజని



టెక్కలి: కోర్టు సముదాయంలో జెండా ఎగురవేస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మల



పలాస: జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న న్యాయాధికారి మాధురి



పొందూరు: కోర్టు ఆవరణలో జెండా ఎగురవేస్తున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.జ్యోత్స్న

స్వాతంత్ర్య.. వజ్రోత్సవ సంబరం

(ఐదో పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో నిర్వహించిన కళారూపం 'నారీ శక్తి', గిరిజన విద్యార్థుల థింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అరసవల్లికి చెందిన బాల సదనం చిన్నారులు యోగాపై చేసిన నృత్య ప్రదర్శనకు ఆహూతులు చప్పట్లతో అభినందించారు.

● అభివృద్ధి, సంక్షేమాన్ని చాటుతూ..

రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చాటేలా వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. పౌరసరఫరాలు, విద్యా, వ్యవసాయ, డీఆర్‌డీఏ, జలవనరులు, వైద్యారోగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపాలిటీ, పోలీసు, అగ్నిమాపక శాఖల శకటాలతో ఆయా శాఖలు అమలు చేస్తున్న పథకాలను ప్రదర్శించారు. వీటిలో విద్యాశాఖ శకటానికి ప్రథమ, వ్యవసాయ శాఖకు ద్వితీయ, వైద్యారోగ్య, గ్రామీణ నీటి సరఫరా శాఖ శకటాలు సంయుక్తంగా తృతీయ బహుమతులు పొందాయి.

● స్టాల్స్ పరిశీలన..

డీఆర్‌డీఏ, ఐటీడీఏ, బీసీ కార్పొరేషన్, ఐసీడీఎస్, విద్యాశాఖ, మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ, వివిధ ప్రభుత్వ శాఖలు 13 స్టాళ్లను ఏర్పాటు చేశాయి. వీటిని మంత్రి అచ్చెన్నాయుడు పరిశీలించారు. సుమారు రూ.4.35కోట్లు విలువైన వ్యవసాయ పనిముట్లు, డ్రోన్లు, స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలు, ఇతర పనిముట్లు, పరికరాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ ద్వారా వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు.. 1400 మందికి పంపిణీ చేశారు. 20 గ్రూపులకు రూ.1.6కోట్లు విలువ చేసే డ్రోన్లను అందజేశారు. డీఆర్‌డీఏ ద్వారా రూ.19 లక్షలు, ఏపీఐఎంపీ ద్వారా రూ.30లక్షలు, మత్స్య శాఖ ద్వారా రూ.18లక్షల విలువగల ఉపకరణాలను అందజేశారు.



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ఎన్ఈఆర్, కలెక్టర్ పుండ్కర్

కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణ మూర్తి, నడుకుదిటి ఈశ్వరరావు, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఏఎస్పీ కేవీ రమణ, ఉప కలెక్టర్ బి.పద్మావతి, డ్వామా పీడీ సుధాకరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థుల ప్రదర్శన (ద్వితీయ బహుమతి)

వెనుకబడిన ముద్రను చెరిపేద్దాం

(ఐదో పేజీ తరువాయి)

చేద్దామని తెలిపారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ప్రకృతి సంపద, విస్తార తీరప్రాంతం, నదుల కలయికతో శ్రీకాకుళం ప్రత్యేకమన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ మూడురోజుల పాటు వజ్రోత్సవాల కార్యక్రమాలను వైభవంగా నిర్వహించామని తెలిపారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ నేడు శ్రీకాకుళం జిల్లా దేశంలో ఒక గౌరవనీయ స్థానంలో నిలిచిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్రీకాకుళం వెనుకబడిన జిల్లా అనే పేరును తొలగించేందుకు పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు కీలకమని తెలిపారు. కార్యక్ర మంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, డీసీసీబీ చైర్మన్ చౌదరి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



గార కేజీబీవీ విద్యార్థుల నృత్య ప్రదర్శన(తృతీయ బహుమతి)



వ్యవసాయ శాఖ శకటం (ద్వితీయ బహుమతి)

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పలాస రూరల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పలాస మండలం టెక్కలిపట్నం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం జడ్యాడ గ్రామానికి చెందిన కంబకాయల దుర్యోధన(75) మృతి చెందాడు. కాశీబుగ్గ పోలీసుల కథనం మేరకు.. దుర్యోధన కూరగాయలు కొనుగోలు చేసేందుకు టెక్కలిపట్నం వచ్చి తిరిగి వెళ్తుండగా.. వేగంగా ద్విచక్ర వాహనం వెనక నుంచి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని హుటాహుటిన స్థానికులు పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై సీఐ పి.సూర్యనారాయణ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో 20 కిలోల గంజాయి స్వాధీనం

● ఒడిశాకు చెందిన ఐదుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ

పలాస, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రెండు ఘటనల్లో 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఒడిశాకు చెందిన ఐదుగురుని అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మోహన్‌బ్లాక్ రాయ్‌జుకా గ్రామానికి చెందిన అనిసెంట్ నాయక్, బురుంగసాహి గ్రామానికి చెందిన మోహిత్ బిరా, మోహనబ్లాక్‌కు చెందిన రబిత్ బిర్లా స్నేహితులు. వీరు కర్నాటక రాష్ట్రానికి చెందిన శ్యామ్యూల్‌తో కలిసి గంజాయి వ్యాపారాన్ని ప్రారంభించారు. కిలోకు రూ.8 వేలు చొప్పున ఒడిశావాసులు ఇస్తుండడంతో దీన్నే వ్యాపారంగా చేసుకున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి పలాస రైల్వేస్టేషన్ వద్ద పది కిలోల గంజాయితో రైలు ఎక్కేందుకు సిద్ధం కావడంతో కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి తన సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా వారు పట్టుబడ్డారు. వీరి నుంచి పది కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గుమ్మా, అడవ గ్రామాలకు చెందిన సురుసింగ్, సమిత్ అభిహోయ్ సంతల్లో పండ్లు కొనుగోలు చేసుకొని ఇతర ప్రాంతాలకు అమ్ముతూ స్నేహితులయ్యారు. వీటితోపాటు గంజాయి రవాణా చేస్తే అధిక డబ్బులు సంపాదించవచ్చని భావించారు. ఈ క్రమంలో పలాస రైల్వే స్టేషన్ వద్ద బ్రోకర్లకు గంజాయిని అప్పగిస్తే కిలోకు రూ.వెయ్యి ఇస్తారని సురుసింగ్‌కు అభిహోయ్ చెప్పాడు. దీంతో ఢిల్లీలో ఉండే బ్రోకర్ సులాత్‌పాణికి పది కిలోల గంజాయిని అప్పగించడానికి బైక్‌పై పలాస రైల్వేస్టేషన్‌కు వస్తుండగా సురుసింగ్, సులాత్‌పాణి పట్టుబడ్డాడు. గంజాయి స్వాధీనం చేసుకుని వీరిని అరెస్టు చేశారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ నర్సింహమూర్తి, సిబ్బందిని సీఐ అభినందించారు.

ఒరిగిన ఆటో.. తప్పిన ప్రమాదం



ఒరిగిన ఆటో వద్ద విద్యార్థులు

పొందూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవానికి విద్యార్థులు ఆటోలో వెళుతుండగా ఒరిగిపోవడంతో ఒక్కసారి వారంతా ఉలికిపడ్డారు. ఈ ఘటన శుక్ర వారం సంభవించింది. సుమారు 20 విద్యార్థులతో వెళుతున్న ఆటో అఫీషియల్ కాలనీ మలుపు ఆటో వెనుక్కు ఒరిగిపోయింది. దీంతో విద్యార్థులు ఒక్కసారి ఆందోళనకు గురయ్యారు. వీరు స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాలల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు జరగకమానవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం రోజున తరగతులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం రోజున పట్టణంలోని ఓ మిషనరీ పాఠశాల తరగతులు నిర్వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉదయం పాఠశాల యాజమాన్యం జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టి, సాంస్కృతిక కార్యక్రమాలు ముగించి ఇళ్లకు పంపివేయాలి. అలా కాకుండా దానికి విరుద్ధంగా తరగతులు నిర్వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టి యాజమాన్యాన్ని నిలదీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అందరికీ సర్దిచెప్పడంతో పిల్లలను ఇళ్లకు విడిచిపెట్టారు. ఈ పాఠశాలపై గతంలోనూ అనేక ఆరోపణలు వచ్చినా మండల విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మహిళల్లో ఆనందం

● స్త్రీశక్తి పథకం ప్రారంభం

● ఉచిత బస్సు ప్రయాణంపై హర్షం

స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ పథకాన్ని ఎమ్మెల్యేలు, ఎంపీలు, కూటమి నాయకులు ఆయా ప్రాంతాల్లో ప్రారంభించారు. మహిళలతో కలిసి కొంత దూరం ప్రయాణించి ఉత్సాహపరిచారు. ఈ పథకం ప్రారంభించడంతో అన్ని వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతుంది.

మహిళా పక్షపాతి చంద్రబాబు

ఆమదాలవలస, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా పక్షపాతి అని మాజీ ఎంపీపీ, ఎమ్మెల్యే సతీమణి కూన ప్రమీల అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద స్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మొదలవలస రమేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, పీఏసీఎస్ అధ్యక్షురాలు శిమ్మ మాధవి, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఉచిత బస్ సర్వీసు ప్రారంభం

కవిటి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీలో మహిళలకు కూటమి ప్రభుత్వం ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిందని ఎమ్మెల్యే, విప్ బి.అశోక్ అన్నారు. బస్టాండ్‌లో మహిళలను బస్ సర్వీసును ప్రారంభించారు. పథకాలు అమలు చేస్తుంటే చూసి తట్టుకోలేక వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, వారికి మహిళలే తగిన బుద్ధి చెప్పాలన్నారు.



ఉచిత బస్ సర్వీసును ప్రారంభిస్తున్న విప్ అశోక్

రణస్థలంలో ఎంపీ, ఎమ్మెల్యే..

రణస్థలం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే స్త్రీ శక్తి పథకాన్ని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఎర్రన్నాయుడు విగ్రహం వరకు మహిళలతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే ఎన్ఈఆర్ బస్సును డ్రైవ్ చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ అవినాష్, కూటమి నాయకులు లంక శ్యామలరావు, డీజీఎం ఆనందరావు, విశ్వక్సేన్, పిసిని జగన్నాథంనాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రణస్థలం నుంచి శ్రీకాకుళం వరకు బస్సును నడపడం విశేషం



ఉచిత బస్సు టిక్కెట్లను అందిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్ఈఆర్

అడగకుండా వరాలిచ్చే నాయకుడు చంద్రబాబు

● ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): అడగకుండానే మహిళలకు వరాలిచ్చే ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బుస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులో మహిళలతో కలసి ప్రయాణించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వజ్జ గంగా భవాని, జోగ త్రివేణి, కమల, వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, దువ్వాడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

మహిళా సాధికారితే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారితే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్రీశక్తి పథకం పేరిట ప్రభుత్వం చేపట్టిన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొరసవాడ వరకూ మహిళలతో కలిసి ప్రయాణించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎప్పుడూ అనుకోలేదు

ఆర్టీసీ బస్సులో ఇలా ఉచితంగా ప్రయాణం చేస్తానని తానెప్పుడు అనుకోలేదు. కూటమి ప్రభుత్వ పుణ్యమాని ఎంతో సంతోషంగా ఉంది.

- ఎల్.అప్పలమ్మ బూరగాం



టిక్కెట్ ఇస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

స్త్రీశక్తి పథకం మహిళలకు వరం

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం మహిళలకు వరం అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఈ పథకాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం వరకు మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించారు. కార్యక్రమంలో నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి బగ్గు అర్చన, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఆసరాగా ఉంటుంది

స్త్రీశక్తి పథకం మహిళలకు ఆసరా నిలిస్తుంది. సీఎం చంద్రబాబు మహిళలు పక్షపాతి అని రుజువు అయింది.

- పుచ్చల కల్పన, నరసన్నపేట

ఈ వార్డెన్ మాకొద్దు

● ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతిగృహ విద్యార్థినుల ఆందోళన

● విచారణకు వెళ్లిన అధికారులను అడ్డుకున్న వార్డెన్

● పోలీసుల సాయంతో లోపలకు వెళ్లిన వైనం



విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాదరావు

పాతపట్నం ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఈ వార్డెన్ మాకొద్దంటూ స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహ విద్యార్థినులు ఆందోళన చేశారు. చేశారు. స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహంలో వాచ్‌మన్(మహిళ)పై వార్డెన్ సుశీల దాడిచేయడంతో శుక్రవారం అలజడి నెలకొంది. ఈ నేపథ్యంలో బాలికలు అధికారులకిచ్చిన సమాచారం మేరకు కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, ఇతర అధికారులతో కలిసి వసతిగృహాన్ని సందర్శించేందుకు శుక్రవారం సాయంత్రం వచ్చారు. అయితే సెలవురోజున విజిట్ చేయడాని మీరెవరంటూ సుమారు అరగంటపైబడే లోపలకు రానీయకుండా వాదించారు. దీంతో పోలీసుల సాయంతో తహసీల్దార్ వసతి గృహం లోపలకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ వార్డెన్ మాకొద్దంటూ విద్యార్థినులు పడుతునన అవస్థలు వివరించారు. వార్డెన్ బూతులు తిడుతుందంటూ వాపోయారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి ముందుకొస్తే బెదిరిస్తుందని తెలిపారు. కలెక్టర్, డీడీలకే కాలర్ పట్టుకు అడిగేదానిని మీరెంత అంటూ ఎమైనా ఫిర్యాదు చేస్తే తరువాత ఉంటాది జాగ్రత్త అని హుకుం చెలాయిస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వార్డెన్ మేడం, మనుమల బట్టలు సైతం మాచేతనే ఉతికిస్తుందని, లేకుంటే కొడతారన్నారు. సాయంత్రమైతే చాలు వసతిగృహం నుంచి సరుకులు మూటలుగా బయటకు తరలిపోతున్నాయని తెలిపారు. మెనూ పాటించకుండా రోజూ వంకాయ కూరే పెడుతున్నారన్నారు. మరమ్మతు పనులు కూడా మాచేతే చేయిస్తుంటరన్నారు. వార్డెన్ కారుడ్రైవర్ ఎప్పుడూ హాస్టల్‌లోనే ఉంటాడు. హాస్టల్‌లో మారూములలోనే తిరుగుతూ ఉండడం కొన్నిసార్లు ఇబ్బందిగా ఉంటుందన్నారు. అదే మాపేరెంట్స్ వస్తే లోపలికి కూడా రానీయడం లేదని వాపోయారు. హాస్టల్‌లో ఉండడం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. దీనిపై ఏఎస్‌డబ్ల్యూవో శ్యామలను తహసీల్దార్ ప్రశ్నించగా.. పలుమార్లు షోకాజ్ నోటీసులు ఇచ్చినా తిరిగి సమాధానం లేదని, ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈవార్డెన్ ఉంటే మేము హాస్టల్‌లో ఉండలేమని వెంటనే మార్చేయాలని విద్యార్థినులంతా ఉమ్మడిగా తహసీల్దార్‌ను కోరారు. ఎంపీడీవో పి.చంద్రకుమారి, ఎస్ఐ బి.లావణ్య తదితరులు ఉన్నారు.

140మంది రక్తదానం

టెక్కలి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): కళింగ కోమట్ల సంఘం, వర్తక సంఘం అధ్యక్షుడు లాడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వైశ్య చౌల్ట్రీలో జరిగిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో 140మంది రక్తదానం చేశారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో దుంప సూర్యం అనే అంధుడు రక్తదానం చేయడం విశేషం. ఈ సందర్భంగా ఆయనకు వైశ్య సంఘ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. వైద్యుడు డాక్టర్ సునీతతో పాటు జాతీయ యువజన అవార్డు గ్రహీత శక్తి చైతన్య ఈ రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షించారు. అలాగే 200మంది జట్టు కలాసీలకు దుస్తులు సైతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జామి రమణయ్య, బి.నాగేశ్వరరావు, బి.మధు, టీబీజీ గుప్త, గోవింద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి దృష్టికి సమస్యలు

నందిగాం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సమస్యలపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి టీడీపీ నాయకులు తీసుకువెళ్లారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలోని రామ్మోహన్ నాయుడు నివాసానికి మండల టీడీపీ అధ్యక్షుచి పినకాన అజయ్‌కుమార్, కొన్ని ప్రసాదరావు, నీటి సంఘం అధ్యక్షుడు కె.జయరాం, అభ్యుదయ రైతు పి.రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు వివరించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, కొండ ప్రాంతాల్లో నెట్ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నందిగాం సీతసాగరాన్ని రిజర్వాయర్‌గా మార్చడమే కాకుండా గొట్టా బ్యారేజీ నుంచి నీరు మళ్లించి సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

కృష్ణాష్టమి వేడుకలు

నరసన్నపేట, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు పాఠశాలలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. మారుతీనగర్‌లో ఉట్టిని కొట్టి వేడుకలను ఉత్సవంగా నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణలు వేషాధారణలు ఆకట్టుకున్నాయి.

సాగునీరు విడిచిపెట్టండి

● కలెక్టర్‌కు మొరపెట్టుకున్న నరసన్నపేట డిస్ట్రిబ్యూటరీ కమిటీ



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న డీసీ చైర్మన్, సభ్యులు

నరసన్నపేట, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): వర్షాలు లేక పోలాకి, నరసన్నపేట మండల రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సాగునీరు విడిచిపెట్టాలని నరసన్నపేట డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, సభ్యులు శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. నరసన్నపేట, పోలాకి మండలాల్లో సుమారు ఏడు వేల ఎకరాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, పోలాకి మండలం డీఎల్ పురం, సత్రావుపేట, బెలమర, కోడూరు, నరసన్నపేట మండలం మాకివలస, మడపాం, గోపాలపెంట తదితర ప్రాంతాలకు సాగునీరు రాక వరిఎదలు ఎండిపోతున్నాయని డీసీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో టీసీలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. టీసీలు కింజరాపు సత్యం, నాగరాజు, ఎంవీ నాయుడు, చిరంజీవి వంశధార ఈఈ మురళీమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతాలు

నరసన్నపేట, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం పురష్కరించుకుని పట్టణంలో పలు ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. సంతోషిమాత ఆలయం, ఉమామహేశ్వర, నీలకంఠశ్వర, రామలింగేశ్వర, ఉమా సోమేశ్వర, గీతామందిరం, జమ్ము, తామరాపల్లి, మాకివలస, కోమర్తి, ఉర్లాం, కంబకాయి, బొరిగివలస తదితర గ్రామాల ఆలయాల్లో మహిళలు సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు.

స్వాతంత్ర్యోద్యమ యోధుడు..

సర్దార్ గౌతు లచ్చన్న

● నేడు రాష్ట్రవ్యాప్తంగా జయంత్యుత్సవాలు

● ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

పలాస, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర్యోద్యమ యోధుడు, ఆంధ్ర రైతోద్యమ రథసారథి, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న కీర్తికెక్కారు. గౌతు లచ్చన్న జయంత్యుత్సవాలు (ఆగస్టు 16) రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం.. ఆయన స్వాతంత్ర్యోద్యమ పోరాట పటిమకు నిదర్శనంగా చెప్పవచ్చు. గౌతు లచ్చన్న 1909 ఆగస్టు 16న శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బారువ గ్రామంలో నిరుపేద గీతకార్మిక కుటుంబం గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు పుట్టారు. ఐదుగురు బిడ్డలు చనిపోగా.. గౌతు సత్యనారాయణ, తోట మహాలక్ష్మి, లచ్చన్న మాత్రమే సజీవంగా మిగిలారు. లచ్చన్న దేశవిముక్తి కోసం జైలుపాలై చివరకు స్వతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర వహించి సర్దార్‌గా నిలిచారు. రైతుకూలీ, ప్రజలను దోపిడీ చేస్తున్న జమిందారులపై పోరాట అవసరాన్ని గుర్తించి లచ్చన్న ఉద్యమంలో దిగి మార్గదర్శకులయ్యారు. స్వతంత్ర పోరాటంలో కోరుగంటి నర్సింహమూర్తి మాస్టారు ప్రేరేపించిన వ్యక్తిగా లచ్చన్న తన స్వీయ జీవితచరిత్రలో రాసుకున్నారు. 1930 గాంధీ ఉప్పుసత్యాగ్రహ ఉద్యమాన్ని నిర్వహించగా.. ఆ పిలుపుమేరకు సత్యాగ్రహంలో పాల్గొని జైలుపాలయ్యారు. నౌపడ స్టేషన్‌లో దిగుతుండగా లచ్చన్నను అరెస్టు చేయడంతో స్వతంత్ర పోరాట రంగంలో లచ్చన్న జీవితం ప్రథమ ఘట్టంగా చెప్పవచ్చు. స్వాతంత్ర్య భారత్‌కు జై అనే నినాదం చేయగా నెలరోజుల పాటు లచ్చన్న, ఆయన అనుచరులను బరంపురం జైలులో బంధించారు. 1938 నవంబరు 7న ఇచ్ఛాపురం నుంచి మద్రాస్‌కు ఆంధ్ర రాష్ట్ర రైతాంగ రక్షణ మహాయాత్ర నిర్వహించి చరిత్రపుటల్లోకి ఎక్కారు. అదే సంవత్సరం పలాసలో కిసాన్ మహాసభలు నిర్వహించి దేశం నలుమూలల నుంచి వివిధ నాయకులను ఆహ్వానించిన ఘనత ఆయనకే దక్కింది.



విద్యుత్‌దీపాల అలంకరణలో గౌతు లచ్చన్న విగ్రహం

పెద్దమనుషుల ఒప్పంద కమిటీలో..

పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం ఫలితంగా ఏర్పడిన భాషాప్రయుక్త రాష్ట్రాల విభజన కమిషన్‌వారి సిఫార్సు మేరకు కేంద్ర ప్రభుత్వం 1956లో ఫిబ్రవరి 20న పెద్దమనుషుల ఒప్పందాన్ని ఏర్పాటు చేసింది. బూర్గుల రామకృష్ణారావు, కేవీ రంగారెడ్డి, ఎం.చెన్నారెడ్డి, జీవీ నర్సింగరావుతో కూడిన కమిటీలో లచ్చన్న కూడా ఒకరు. 1953 సంవత్సరం నవంబరు 7న టంగుటూరు ప్రకాశం పంతులు మంత్రివర్గంలో చేరి పదవిని అలంకరించారు. ఆయన జీవితాంతం బడుగు, బలహీనవర్గాలకే అంకితం కావడం విశేషం.

టీడీపీ హయాంలో గుర్తింపు..

సర్దార్ లచ్చన్న సేవలు గుర్తించి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం లచ్చన్న, ఆచార్య ఎన్‌జీ రంగా విగ్రహాలను శ్రీకాకుళం డేఅండ్ నైట్ జంక్షన్ వద్ద నెలకొల్పి సముచిత గౌరవాన్ని ఇచ్చింది. గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19న కన్నుమూశారు. లచ్చన్న రాజకీయంగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎంపికై ప్రజలకు సేవలు చేశారు. రాష్ట్ర మంత్రిగా కూడా వ్యవహరించారు. 1952 మొదటి శాసనసభకు కృషికార్ లోక్‌పార్టీ నుంచి సోంపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి 1955లో, స్వతంత్ర పార్టీ నుంచి 1962లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1967లో స్వతంత్ర పార్టీ, 1978లో జనత పార్టీ ఎమ్మెల్యే గా సేవలందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన పోరాట స్ఫూర్తికి గుర్తుగా ఏటా అధికార కార్యక్రమంగా జయంత్యుత్సవాలు ఉత్సవాలు నిర్వహిస్తూ గౌరవిస్తోంది.

వైసీపీ హయాంలో వివక్ష..

గత వైసీపీ హయాంలో అధికారికంగా నిర్వహించే లచ్చన్న జయంత్యుత్సవాలను రద్దు చేసింది. పార్టీలకు అతీతంగా గౌరవం పొందుతున్న లచ్చన్నపై వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్షతో వివక్ష చూపడంపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వచ్చాయి. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం మళ్లీ దీన్ని పునరుద్ధరించి అధికారికంగా నిర్వంహించేలా రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో ఆయన విగ్రహాలు అనేక ముఖ్య పట్టణాల్లో నెలకొల్పుతూ గౌతు లచ్చన్నను గుర్తుకు తీసుకువస్తుండడం ఆయన పోరాట స్ఫూర్తికి నిదర్శనంగా చెప్పవచ్చు.

విద్యార్థులకు నర్సింహమూర్తి స్మారక అవార్డులు



విద్యార్థులకు స్మారక అవార్డులు అందిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రిటైర్డ్ హెడ్‌మాస్టర్ మణిపాత్రుని నర్సింహమూర్తి స్మారక అవార్డులను శుక్రవారం ప్రదానం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా టెన్త్‌లో ప్రథమ స్థానం పొందిన పట్నాన శ్రీమృదులకు రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన కొమర నిర్మలకు రూ.3 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన సిగురువలస కల్పనకు రూ.2 వేలు నర్సింహమూర్తి కుటుంబసభ్యులు అందజేశారు.

కరెన్సీ నోట్లతో అలంకరణ



పొందూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని కాశీ విశ్వేశ్వరాలయంలోని ధనలక్ష్మి అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కంచికామాక్షి ఆలయంలో గాజులు, పసుపుకొమ్ములతో అమ్మవారిని అలంకరించారు. అమ్మ వార్లను పలువురు భక్తులు దర్శించుకున్నారు.

● ఇచ్ఛాపురం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారిని శ్రావణ శుక్రవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ● పెద్ద జగన్నాథ స్వామి దేవాలయంలో ఉన్న మహాలక్ష్మి దేవి అమ్మవారిని విశేష అభిషేకాలు చేశారు. 2008 పుష్పాలతో అలంకరించారు.

దుస్తుల పంపిణీ

జలుమూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): యలమంచిలి గ్రామంలో నిరుపేద కుటుంబాలకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. పీ4 స్ఫూర్తితో గ్రామంలో నిరుపేదలను గుర్తించి సాయం అందించినట్లు అదే గ్రామానికి చెందిన చల్లవానిపేట సొసైటీ మాజీ అధ్యక్షుడు వాన కనకయ్య, రైసుమిల్లు యజమాని కొర్ను జగ్గారావు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి విరాళాలు

జలుమూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట ప్రభుత్వ ఉన్నతపాఠశాల అభివృద్ధికి దాతలు విరాళాలు వెల్లువ అందించారు. శుక్రవారం ఒక్కరోజునే రు.1,11,338 దాతలు, పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు హెచ్‌ఎం నిర్మలాదేవికి అందించారు.